సాక్షి ఒడిశా

మంగళవారం । 22 । జూలై । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,72,393లు, బంగారం 1గ్రాము 800 మిల్లీగ్రాములు, వెండి 3గ్రాముల 800 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గవర్నర్‌తో సీఎం సమావేశం

గవర్నర్‌తో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

- 10లో.



ర్యాగింగ్ ఆరోపణలు

రెవెన్షా హాస్టల్‌లో ర్యాగింగ్ ఆరోపణలు వచ్చాయి. కొందరిపై చర్యలు తీసుకున్నారు.

- 10లో.

న్యూస్‌రీల్

ఏఐసీసీ అధ్యక్షుడుకి కొరాపుట్ ఎంపీ శుభాకాంక్షలు



ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేని అభినందిస్తున్న కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క

కొరాపుట్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న ఏకైక ఎంపీ సప్తగిరి ఉల్క (కొరాపుట్) ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖార్గేకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం న్యూఢిల్లీలోని అఖిల భారత కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొరాపుట్ ప్రాంత కాంగ్రెస్ నాయకులతో కలిసి ఖర్గేను అభినందించారు. రాహుల్ గాంధీ కోటరీలో ఉన్న ఎంపీ సప్తగిరి ఉల్కపై ఏఐసీసీకి ప్రత్యేక అభిమానం ఉంది. గత రెండు సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుంచి సప్తగిరి ఉల్క మాత్రమే విజయం సాధిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఈశాన్య భారతంలో ఐదు రాష్ట్రాలకు సప్తగిరి ఉల్క పరిశీలకుని హోదాలో ఉన్నారు. కార్యక్రమం అనంతరం రాహుల్‌తో భేటి అయి బేటీ ఒడిశా రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడుల వివరాలు అందించారు.

8 క్వింటాళ్ల గంజాయి పట్టివేత



చిత్రకొండ క్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ స్వాభీమాన్ ఏరియా జోడాంబు పోలీసుస్టేషన్ పరిధిలోని సధరామ్ గ్రామ అడవిలో గంజాయి ఉన్నట్లు ఆదివారం రాత్రి జిల్లా ఎక్సైజ్ అధికారి బింబధర్ పండాకు ముందస్తు సమాచారం రావడంతో ఆదివారం రాత్రి ఎక్సైజ్ శాఖ అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో 8 క్వింటాళ్ల గంజాయి బస్తాలు స్వాధీనం చేసుకున్నారు. అధికారుల రాకను గమనించిన మాఫియా సభ్యులు పరారైపోయారు. గంజాయి తూకం వేయగా 844 కిలోలు ఉంది.

42 కిలోల అడవి పంది మాంసం పట్టివేత



అటవీ శాఖ వారు స్వాధీనం చేసుకున్న అడవి పంది మాంసం, నిందితులు, ఆయుధాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్వాభీమాన్ ఏరియా సరుకుబంద్ గ్రామం సమీపం అడవి వద్ద ఆదివారం రాత్రి చిత్రకొండ అటవీ శాఖ వారు అడవి పందుల వేటగాళ్లను పట్టుకున్నారు. వారి నుంచి 42 కిలోలకు పైగా మాంసం, వందకు పైగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. రెండు అడవి పంది పిల్లలు, 9 బైక్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. చిత్రకొండ అటవీ శాఖ వారికి ఈ ప్రాంతంలో అడవి జంతువుల వేట జరుగుతుందని సమాచారం రావడంతో అటవీ శాఖ అధికారి నిరంజన్ సార్కా నేతృత్వంలో రేంజ్ ఆఫీసర్ రాజేష్ కుమార్ సేతి తన సిబ్బందితో కలిసి దాడి చేశారు.

ఏటీఎం లూటీ యత్నం భగ్నం



పట్టుబడిన నిందితులతో పోలీసు సిబ్బంది

జయపురం: జయపురంలోని ఎస్‌బీఐకి చెందిన ఏటీఎంను లూటీ చేసేందుకు దుండగులు ప్రయత్నించగా స్థానికులు భగ్నం చేశారు. జయపురం పట్టణ పోలీసుస్టేషన్‌కు వంద మీటర్ల దూరంలోని ఏటీఎం కౌంటర్ లూటీ చేసేందుకు దుండగులు చేసిన ప్రయత్నాన్ని ఆ ప్రాంత ప్రజలు భగ్నం చేసినట్లు పట్టణ పోలీసు అధికారి సోమవారం తెలిపారు. పోలీసుల వివరణ ప్రకారం.. ఆదివారం ఎస్‌బీఐ ఏటీఎం కౌంటర్ లూటీ చేసేందుకు ఇద్దరు యువకులు కౌంటర్‌ను బద్దలు కొడుతుండగా స్థానికులు చూసి వారిని చుట్టుముట్టి పోలీసులకు తెలియజేశారు. వెంటనే పోలీసులు చేరుకొని వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిరువురు మరో రాష్ట్ర వాసులని పోలీసు అధికారి వెల్లడించారు. పోలీసులు వారిని విచారించగా పట్టుబడిన వ్యక్తులు హరియాణ రాష్ట్రానికి చెందిన రసీద్ ఖాన్, మోహిన్ ఖాన్‌లు వెల్లడించారు. వారు హర్యాణ రాష్ట్రం నుంచివచ్చి కార్మికులుగా పని చేస్తున్నారని వెల్లడించారు. గతంలో రాయగడ జిల్లా మునిగుడలో కార్మికులుగా పని చేసి కొరాపుట్ జిల్లాకు వచ్చారని పోలీసులు చెప్పారు. ఏటీఎం సూపర్‌వైజర్ ఫిర్యాదు మేకరు వారిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దండకారణ్యంలో ..
బోల్ భం శంఖారావం



ఘాట్ల వద్ద రక్షణ ఏర్పాట్లు



అర్ధరాత్రి శబరి నది వద్ద ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న జయపూర్ సబ్ కలెక్టర్ ఆకవరం సస్య రెడ్డి



భక్తులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ సస్యరెడ్డి

కొరాపుట్:

ఐదు రాష్ట్రాల ఆరాధ్య క్షేత్రం గుప్తేశ్వరం బోల్ భం శంఖారావంతో ధ్వనించింది. సోమవారం కొరాపుట్ జిల్లా జయపూర్ సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితిలోని దండకారణ్యం పూర్తి కాషాయమయంగా మారింది. శ్రావణ మాస సోమవారం సందర్భంగా సహజ సిద్ధ పుణ్యక్షేత్రంలో శివలింగానికి పవిత్ర జలంలో అభిషేకం చేయడానికి వేల సంఖ్యలో కాషాయధారులు తరలి వచ్చారు. సోమ వారం వేకువ జామున్కే వేల సంఖ్యలో భక్తులు చేరి పోయారు. అర్ధరాత్రి పన్నెండుకి గుహ గేట్లు తెరవడంతో భక్తులు తమ పాద యాత్ర ద్వారా తెచ్చిన పవిత్ర జలంతో గుప్తేశ్వరుడికి అభిషేకం చేశారు. రాత్రి పన్నెండుకి తలుపు తీస్తారనే సమాచారంతో ముందు రోజు సాయంత్రం 5 గంటల నుంచి భక్తులు క్యూలో ఉన్నారు. ఈ క్యూ రెండు కిలోమీటర్ల వరకు కొనసాగింది.

తరలి వచ్చిన పక్క రాష్ట్రాల ప్రజలు

ఈ సోమవారం గుప్తేశ్వరానికి సుమారు యాభై వేల మంది ప్రజలు తరలి వచ్చినట్లు అంచనా. ఒడిశాతో పాటు చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బంగ, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ యాత్ర శ్రావణ మాసంలో ప్రతి సోమవారం జరగనుంది. దారి పొడవునా అనేక స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు భారీ ఎత్తున భక్తులకు ఉచిత సౌకర్యాలు కల్పించారు. పాత్రో పుట్ వంతెన నుంచి బొయిపరిగుడ, రామ గిరి, డొక్రి ఘాట్‌ల మీదుగా ప్రతి చోట ఆహారం, వైద్యం, పాద సేవలు అందజేశారు. నాలుగు దశాబ్దాలుగా ఇక్కడ బోల్ భం యాత్ర జరుగుతోంది. ఇక్కడ బోల్‌భం భక్తులను పట్టించుకునే నాథుడే లేకపోయాడు. ఇప్పుడు స్వచ్ఛందంగా సేవలు అందిస్తుండడంతో పరిస్థితి మారింది.

జయపూర్ సబ్ కలెక్టర్ రంగ ప్రవేశం

గతంలో ప్రభుత్వ కేవలం మహాశివరాత్రికే గుప్తేశ్వరం గుర్తు చేసుకొనేది. ఏ అధికారీ బోల్‌భం భక్తులను పట్టించుకోలేదు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు లోతు తెలియక శబరి నదిలో మునిగిపోయేవారు. కానీ ఈ ఏడాది జయపూర్ సబ్ కలెక్టర్ ఆకవరం సస్య రెడ్డి భక్తుల భద్రతకి గట్టి చర్యలు తీసుకున్నారు. ఆదివారం రాత్రంతా గుప్తేశ్వరంలో మకాం వేసి ఏర్పాట్లు పర్యవేక్షించారు. శబరి నది వద్ద అగ్ని మాపక సిబ్బందితో పాటు ఓడ్రాఫ్ టీమ్‌ని మోహరించారు. పెద్ద ఎత్తున పోలీసు, అటవీ, రెవెన్యూ, దేవదాయ, విద్యుత్ శాఖల సిబ్బందిని సిద్ధం చేశారు. తక్షణ నిర్ణయాల కోసం ఒక మెజిస్ట్రేట్ అధికారిని ఏర్పాటు చేశారు. మరో వైపు బీఎస్‌ఎఫ్ జవాన్లు కూడా ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు.



ముందు రోజు గుప్తేశ్వరంలో పర్యటిస్తున్న కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్



ప్రభుత్వం ఏర్పాటు చేసిన టెంట్లు వద్ద సేదతీరుతున్న భక్తులు



బీఎస్‌ఎఫ్ జవాన్లు ఏర్పాటు చేసిన వైద్య శిబిరం



మూకుమ్మడి బోల్ భం దీక్ష తీసుకుంటున్న భక్తులు

పింఛన్లు, రేషన్ కార్డులు పంపిణీ



దివ్యాంగ మహిళకు స్టీల్ చైర్ అందజేస్తున్న మంత్రి రబినారాయణ నాయిక్ తదితరులు

జయపురం: పంచాయతీరాజ్ శాఖ మంత్రి రబినారాయణ నాయిక్ ఆదివారం సాయంత్రం జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆరుగురు లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, ఎనిమిది మంది లబ్ధిదారులకు పింఛన్ మంజూరు కార్డులు అందజేశారు. దివ్యాంగ మహిళకు స్టీల్ చైర్ అందించగా.. 27 స్వయం సహాయక గ్రూపు మహిళలకు రూ. 39 లక్షలు రుణం పంపిణీ చేశారు. అనంతరం సమితి కార్యాలయ సభాగృహంలో సమితి స్థాయి అధికారులతో సమితిలో అభివృద్ధి పనులపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వర్ధన్, బొరిగుమ్మ సీడీవో వేణుధర శబర, బీడీవో సుకాంత కుమార్ పట్నాయక్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి స్థానిక డాక్ బంగ్లాలో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. బొరిగుమ్మ సమితిలో పార్టీ బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృత నిశ్చయంతో పని చేయాలన్నారు. పార్టీ కార్యకర్తల సమావేశంలో మంత్రితో పాటు రాష్ట్ర బీజేపీ కార్యవర్గ శాశ్వత సభ్యులు గౌతమ సామంతరాయ్, మండలి అధ్యక్షులు బిఘ్నేశ్వర షాడంగి, సావణ మహంతి, భాస్కర భట్, గోవింద భట్, చక్రధర గదబ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మహిళకు గాయాలు



గాయపడిన సుమిత్ర

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ సమితి మాలతీపూర్ గ్రామ సమీపంలోని కెనాల్ వద్ద సోమవారం మహిళపై పిడుగు పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన సుమిత్ర గౌడా కెనాల్ వద్ద ఆవులను పచ్చిక మేపేందుకు తీసుకువెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి ఆవులను తొలుకుని వస్తుండగా ఉరుములతో కూడిన వర్షం కురవడంతో కెనాల్ వద్ద ఆగారు. అదే సమయంలో పిడుగు పడడంతో స్పృహతప్పి పడిపోవడంతో గాయపడ్డారు. అక్కడ ఉన్నవారు చూసి వెంటనే అంబులెన్స్‌ను రప్పించి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

బొడసుక్కు వంతెన నిర్మాణ పనుల పరిశీలన



బొడ సుక్కు వంతెన నిర్మాణం పరిశీలిస్తున్న మంత్రి రబి నాయక్



బొడ సుక్కు వంతెన నిర్మిత ప్రాంతం

కొరాపుట్: బొడసుక్కు వంతెన నిర్మాణ పురోగతిని రాష్ట్ర పంచాయతీ రాజ్, తాగునీటి శాఖ మంత్రి రబి నాయక్ పరిశీలించారు. సోమవారం కొరాపుట్ జిల్లా కేంద్రం నుంచి నిర్మితమవుతున్న ప్రదేశానికి చేరుకున్నారు. రూ.64 కోట్లతో ప్రభుత్వం నిర్మిస్తున్న ఈ వంతెన వల్ల దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు పడుతున్న కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు. బొడసుక్కు గ్రామం నుంచి కొరాపుట్‌కి కేవలం 5 కిలోమీటర్ల దూరం ఉంటుందని తెలిపారు. కానీ అడ్డంగా కొలాబ్ రిజర్వాయర్ ఉండడంతో ప్రజలు 70 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. ఇక్కడ వంతెన కోసం కొరాపుట్, నందపూర్, లమ్తాపుట్ సమితుల ప్రజలు అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతానికి కనెక్టివిటీ పూర్తవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యేలు రఘురాం మచ్చో, రుపు దర్ బోత్ర, కలెక్టర్ వి.కీర్తి వాసన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీసీ కార్యాలయాల ఆవరణలో బీజేడీ ఆందోళన



ఆర్డీసీ కార్యాలయం ఘెరావ్ ఆందోళనలో పాల్గొన్న మహిళలు



కటక్ ఆర్డీసీ కార్యాలయం ఎదురుగా బీజేడీ కార్యకర్తల నిరసన సభ



రాష్ట్ర గవర్నర్ చొరవను కోరుతూ కటక్ ఆర్డీసీకి స్మారక పత్రం అందజేస్తున్న బీజేడీ వర్గీయులు

భువనేశ్వర్: రాష్ట్రంలో మహిళలు, యువతులు, విద్యార్థినులు, బాలికలకు భద్రత, రక్షణ పూర్తిగా లోపించింది. ఈ వర్గాలపై నేరాలు నిత్యకృత్యాలుగా మారుతున్నాయి. రాష్ట్రంలో మహిళ మనుగడ క్షణ క్షణం భయం భయంగా తయారైందని విపక్ష బిజూ జనతా దళ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితులపై రాష్ట్ర గవర్నర్ జోక్యం ఆశిస్తు బిజూ జనతా దళ్ సభ్యులు రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ డివిజన్ కమిషనర్ల ఆధ్వర్యంలో స్మారక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో సోమవారం శాంతియుతంగా నిరసన ఊరేగింపులు, బహిరంగ సభలు నిర్వహించి ఆర్డీసీలకు స్మారక పత్రం అందజేశారు. బాలాసోర్ ఫకీర్ మోహన్ అటానమస్ కళాశాల విద్యార్థిని సౌమ్య శ్రీ బీసీ ఆత్మాహుతి మరణం, ఢిల్లీ ఎయిమ్స్‌లో ఆగంతకుల నిప్పు దాడితో మృత్యు పోరాటం చేస్తున్న పూరీ జిల్లా బొలొంగా ప్రాంతపు బాలిక దయనీయ పరిస్థితులు రాష్ట్రంలో సగటు మహిళకు రక్షణ కొరవడిన వైపరీత్య పరిస్థితులకు నిలువెత్తు తార్కాణంగా పేర్కొన్నారు. కటక్‌లోని సెంట్రల్ రెవెన్యూ కమిషనర్ కార్యాలయం ఆవరణలో చేపట్టిన ఆందోళనలో 10 జిల్లాల నుంచి బిజూ జనతా దళ్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఒడిశాలో మహిళలపై జరిగిన నేరాలు, వారి రక్షణ, ఫకీర్ మోహన్ అటానమస్ కాలేజీ విద్యార్థి మరణంపై న్యాయ విచారణ జరపాలని వీరంతా డిమాండ్ చేశారు. రాష్ట్ర హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి అధ్యక్షతన ఈ విచారకర సంఘటనపై న్యాయ విచారణ జరపాలని బీజేడీ డిమాండ్ చేసింది. సంబల్‌పూర్, బరంపురం ఆర్డీసీ కార్యాలయాల ఆవరణలో ఈ తరహా ఆందోళనలు ఏక కాలంలో చేపట్టి రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ వైఫల్యంపై నిరసన వ్యక్తం చేశారు.

మహిళలపై దాడులు అరికట్టాలి



ర్యాలీలో బీజేడీ పార్టీ సీనియర్ నాయకులు రమేష్ మజ్జి, రబినందో, శివ పట్నాయక్, నాగుదొర తదితరులు



నిరసనలో పాల్గొన్న డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారీ, బాలారాయ్ తదితరులు

- బ్రహ్మపురలో ఆందోళన
- భారీగా హాజరైన బీజేడీ పార్టీ నాయకులు

కొరాపుట్: రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ప్రతిపక్ష బీజేడీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బ్రహ్మపురలో సోమవారం ఆందోళన చేపట్టారు. నబరంగ్‌పూర్, కొరాపుట్ జిల్లాలకు చెందిన బీజేడీ నాయకులు భారీగా పాల్గొన్నారు. బ్రహ్మపుర పట్టణంలో దక్షిణ ఒడిశా రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని పార్టీ శ్రేణులు ముట్టడించారు. దక్షిణ ఒడిశాలోని పది జిల్లాల నుంచి కార్యకర్తలు ఆందోళనలో పాల్గొన్నారు. బాలేశ్వర్ జిల్లాలో విద్యార్థిని సౌమ్యశ్రీ హత్యతోపాటు రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. భారీ ర్యాలీ అనంతరం బహిరంగ సభ జరిగింది. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో నబరంగ్‌పూర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి రమేష్ చంద్ర మజ్జి, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, మాజీ ఎంపీ ప్రతిప్ మజ్జి, జెడ్పీ ప్రెసిడెంట్ మెతిరాం నాయక్ హాజరవ్వగా.. కొరాపుట్ జిల్లా నుంచి మాజీ మంత్రి రబి నారాయణ నందో, మాజీ ఎంపీ జిన్ను హిక్కా, మాజీ మంత్రి పద్మిని దియాన్, మాజీ ఎమ్మెల్యేలు రఘురాం పొడాల్, ప్రభు శాంత, ప్రఫుల్ల పంగి, పీతం పాడీ, బీజేడీ నాయకులు నాగరాజు దొర, లతా రాయ్, దుర్గా మిశ్రా, బాల్ రాయ్, శివ పట్నాయక్, బాలంకేశ్వర రావు, ప్రసాద్ బిడ్డిక పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారీ, బాలారాయ్ తదితరులు



బ్రహ్మపురలో ర్యాలీ చేస్తున్న బీజేడీ పార్టీ శ్రేణులు



ఆందోళనలో కొరాపుట్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు రఘురాం పోడాల్, ప్రభు శాంత, ప్రఫుల్ల పంగీలు



బైఠాయించిన నబరంగ్‌పూర్ జెడ్పీ చైర్మన్ మెతిరాం నాయక్, మాజీ మంత్రి పద్మిని దియాన్, అనసూయ మజ్జి, కౌసల్య హిక్కా తదితరులు

క్లుప్తంగా

ఫైరింజన్ ఢీకొని విద్యార్థి దుర్మరణం



ఘటనా స్థలంలో దుర్ఘటన దృశ్యం

భువనేశ్వర్: అగ్ని మాపక వాహనం (గంటల లారీ) ఢీకొని కళాశాల విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. పూరీ చందనపూర్ ప్రాంతంలో ఈ దుర్ఘటన సోమవారం చోటు చేసుకుంది. కళాశాల నుంచి బైక్‌పై తిరిగి వస్తుండగా అగ్ని మాపక వాహనం ఢీకొంది. ఘటనా స్థలంలో విద్యార్థి మృతి చెందాడు. సహబికి చెందిన చందన్ పూర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మృతుడిని పూరీ ఎస్‌సీఎస్ కళాశాల విద్యార్థి శుభం సేనాపతిగా గుర్తించారు. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి విచారం వ్యక్తం చేశారు. మృత విద్యార్థి కుటుంబం పట్ల సానుభూతి ప్రకటించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 4 లక్షల పరిహారం ప్రకటించారు.

ఫార్మసీ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

రాయగడ: ఒడిశా ఫఆర్మసీ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ రాయగడ శాఖ నూతన కార్యవర్గం ఎన్నికైంది. స్థానిక సమావేశం హాల్‌లో సోమవారం ఎన్నిక ప్రక్రియ జరిగింది. అధ్యక్షులుగా శివప్రసాద్‌నాయక్, ఉపాధ్యక్షులుగా అశ్విని కుమార్ రవుత్, సాధారణ కార్యదర్శిగా సంతోష్ కుమార్ పాత్రో, సహకార్యదర్శులుగా ల్యాబ్ బాగ్, ప్రమోద్ కుమార్ సాహు, కోశాధికారిగా జగన్నాథ్ నాయక్, రాయగడ సబ్ డివిజన్ ఆర్గనైజేషనల్ కార్యదర్శిగా హరినాథ్ భంగి, గుణుపూర్ సబ్‌డివిజన్ ఆర్గనైజేషనల్ కార్యదర్శిగా సూర్యనారాయణ పండ నియమితులయ్యారు. రెండేళ్ల పాటు కొత్త కార్యవర్గం కార్యకలాపాలను నిర్వహిస్తుంది.

బాధిత బాలికని పరామర్శించిన బీజేడీ ఎంపీలు



ఢిల్లీ ఎయిమ్స్ ఆవరణలో బాధిత బాలికని కలిసిన బీజేడీ ఎంపీలు

భువనేశ్వర్: న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న పూరీ జిల్లా నిమ్మాపడా ప్రాంతం బొలంగా గ్రామానికి చెందిన బాలికని బిజూ జనతాదళ్ పార్లమెంటు సభ్యులు సోమవారం కలిశారు. వారిలో మానస్ మంగరాజ్, డాక్టరు సస్మిత్ పాత్రో, సులతాదేవ్, నిరంజన్ ఉన్నారు. ఈ సందర్భంగా చికిత్స కల్పిస్తున్న వైద్య నిపుణుల బృందంతో చర్చించి బాలిక ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. బాధిత బాలిక బంధువులతో కలిసి ఆత్మస్థైర్యంతో ఉండాలని ప్రోత్సహించారు. సహాయ సహకారాలు అందుబాటులో ఉంటాయని అభయం ఇచ్చారు.

రక్షణ కమిటీ ఏర్పాటు



కమిటీ సభ్యులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా మహా విద్యాలయంలో లైంగిక వేధింపుల నుంచి రక్షణ పొందేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది. సోమవారం సీనియర్ అధ్యాపకురాలు డాక్టర్ సంజుక్త పండా నేతృత్వంలో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు యాజమాన్యం ప్రకటించింది. ఇందులో పది మంది సభ్యులు ఉంటారు. వారి పేర్లు, ఫోన్ నంబర్లతో కూడిన బ్యానర్‌ను కళాశాలలో ఏర్పాటు చేశారు. విద్యార్థినులకు ఎవరైనా లైంగిక వేధింపులకు గురిచేస్తే తమను సంప్రదించాలని సంజుక్త ప్రకటించారు. అంతేకాక ప్రభుత్వం తరఫున 181 టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా వినియోగించుకోవచ్చన్నారు. విద్యార్థినుల భద్రతకే కమిటీ ప్రాధాన్యం ఇస్తుందని ప్రకటించారు.

ఘనంగా రెవెన్యూ ఉద్యోగుల సంఘం వార్షికోత్సం

కొరాపుట్: ఒడిశా రెవెన్యూ సర్వీసు ఉద్యోగుల సంఘం 82వ వార్షికోత్సం ఘనంగా జరిగింది. సోమవారం జయపూర్ సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి కొరాపుట్ జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ గిరిజన సంప్రదాయాలతో జయనగర సంగం కల్యాణ మండపం వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ జరిగిన సమావేశంలో కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ నాయకుడు బిహారి మహాపాత్రో మాట్లాడుతూ ఈ సమస్యల పరిష్కారానికి ఉద్యమ బాట తప్పదన్నారు. రాష్ట్ర కార్యదర్శి చిత్తరంజన్ మాట్లాడుతూ ఉద్యోగులు ఐక్యంగా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకుడు నారాయణ దాస్, జ్ఞాన్ రంజన్ దాస్, దేవేంద్ర పాత్రో, సంజయ్ కుమార్ పండా, శశి భూషణ్ దాస్ ప్రసంగించారు.

రెవెన్షా హాస్టల్‌లో ర్యాగింగ్ ఆరోపణలు

- 10 మంది విద్యార్థుల తొలగింపు
- సమైక్యంగా ఎదురు తిరిగిన విద్యార్థులు



ఈస్టు హాస్టలు ఆవరణలో విద్యార్థుల నిరసన

భువనేశ్వర్:

కటక్ రెవెన్షా విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ వివాదం ఆకస్మిక మలుపులు తిరగడంతో క్యాంపస్‌లో వివాదాస్పద పరిస్థితి తాండవిస్తుంది. ఈస్ట్ హాస్టలులో జూనియర్ విద్యార్థుల ఫిర్యాదు ఆధారంగా 10 మంది సీనియర్ విద్యార్థులను వెంటనే హాస్టల్ నుంచి బయటకు వెళ్లమని క్యాంపస్ అధికార వర్గాలు ఆదేశించారు. వీరంతా డిగ్రీ 3వ సంవత్సరపు విద్యార్థులుగా పేర్కొన్నారు. కొత్తగా చేరిన విద్యార్థుల పట్ల అసభ్య పదజాలం ప్రయోగించి కించపరిచినట్లు తలెత్తిన ఆరోపణ కింద అధికార వర్గం ఈ చర్యని చేపట్టినట్లు ఆదేశాలు పేర్కొన్న ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

మలుపు తిరిగిన పరిస్థితి

ర్యాగింగ్ ఆరోపణల కింద చర్యలు చేపట్టడంతో విద్యార్థి వర్గం విజృంభించింది. వాస్తవానికి ర్యాగింగు జరగనే లేదు. బలవంతంగా తమతో ఈ ఫిర్యాదు దాఖలు చేయించినట్లు జూనియర్ విద్యార్థి వర్గం సోమవారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో తమ పట్ల చర్యలు ఎంత మాత్రం సమంజసం కాదని ఆరోపణలకు గురైన సీనియర్ విద్యార్థి వర్గం ఎదురు తిరిగింది. ఈస్ట్ హాస్టలు ఆవరణలో ధర్నాకు దిగింది. క్యాంపస్ ఆవరణలో మౌనంగా నిరసన ప్రదర్శించింది. సీనియర్ విద్యార్థి వర్గానికి తాజా విద్యార్థుల వర్గం మద్దతుగా నిలిచింది. దీంతో కథ అడ్డం తిరిగింది. విద్యార్థులకు వ్యతిరేకంగా అధికార, యాజమాన్య వర్గం ఉద్దేశపూర్వకంగా అవాంఛనీయ చర్యలు చేపడుతోందని ఆరోపిస్తున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు ర్యాగింగ్ జరగలేదని ఖండించారు. ఈ వర్గం సోమవారం రెవెన్షా విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్‌కు సంతకం చేసిన లిఖిత పత్రం అందజేసింది. హాస్టల్ అధికారులు తమ సీనియర్లను తప్పుడు కేసుల్లో ఇరికించాలని ఒత్తిడి చేశారని వివరించారు. హాస్టల్ సూపరింటెండెంట్, ఇతర సిబ్బంది తమ సీనియర్లపై ర్యాగింగ్ ఆరోపణలు చేయమని బలవంతం చేశారని ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా వారిని హాస్టల్ నుంచి బహిష్కరణకు ఉత్తర్వుల జారీ చేశారని పేర్కొన్నారు.



క్యాంపస్ ప్రాంగణంలో మౌన ప్రదర్శనలో విద్యార్థి వర్గం

శనివారం అర్ధరాత్రి జరిగిన సంభాషణలో జూనియర్లను వేధించారనే ఆరోపణలపై 10 మంది మూడో సంవత్సరం విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు విశ్వవిద్యాలయం ప్రకటించిన ఒక రోజు తర్వాత ఈ విషయం వెల్లడైంది. విద్యార్థులను తూర్పు హాస్టల్‌ను ఖాళీ చేయమని ఆదేశించి, తాత్కాలికంగా విశ్వవిద్యాలయ అతిథి గృహంలో ఉంచారు. నిందితులైన సీనియర్లు స్నేహపూర్వకంగా, సమాచారం అందించే చర్చలో ఇరు వర్గాల మధ్య ఉల్లాసభరితంగా సంభాషణ కొనసాగుతుండగా చీఫ్ వార్డెన్ అకస్మాత్తుగా జోక్యం చేసుకుని సీనియర్లపై ర్యాగింగ్ ఆరోపణలు చేసి, శిక్షార్హమైన చర్య తీసుకున్నారని జూనియర్లు పేర్కొన్నారు. క్రమశిక్షణ చర్యలను వెంటనే రద్దు చేయాలని, సీనియర్లను హాస్టల్‌లోకి తిరిగి చేర్చుకోవాలని దరఖాస్తు డిమాండ్‌తో ఉభయ వర్గాల విద్యార్థులు పట్టుబడుతున్నారు. న్యాయసమ్మతంగా విచారణ జరిపించి తమ ప్రతిష్టను పునరుద్ధరించాలని ప్రభావిత సీనియర్ విద్యార్థి వర్గం డిమాండ్ చేస్తోంది.

ర్యాగింగ్ జరిగినట్లు ర్యాగింగు వ్యతిరేక విభాగానికి ఫిర్యాదు చేశారు. ర్యాగింగు ఫిర్యాదు పట్ల స్పందించేందుకు పని చేస్తున్న కమిటీ సిఫారసు మేరకు 10 మంది విద్యార్థులను హాస్టల్ నుంచి సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాజాగా ఫిర్యాదు వర్గం వ్యతిరేకిస్తున్నందున దర్యాప్తు జరుగుతుంది. ర్యాగింగ్ వ్యతిరేక విభాగం ఈ సమగ్ర సంఘటనపై విచారణ జరిపి పటిష్టమైన చర్యలు చేపడుతుందని రెవెన్షా విశ్వ విద్యాలయం చీఫ్ వార్డెన్ సుదర్శన మిశ్రా సోమ వారం ప్రకటించారు. క్యాంపస్‌లో శాంతియుత వాతావరణం కొనసాగించాలని విద్యార్థి వర్గాన్ని కోరింది.

కలిమెల సమితిలో గ్రీవెన్స్‌సెల్ నిర్వహణ



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు కలిమెల సమితి పరిసర పంచాయతీలకు చెందిన వారు తమ వినతులను కలెక్టర్‌కు అందజేశారు. మొత్తం 29 వినతులు అధికారులకు అందాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. కలిమెల సమితిలోని సమస్యలను త్వరలోనే తీరుస్తామన్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన వినతులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వినోద్ పటేల్, జిల్లా సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, జిల్లా అభివృద్ధిశాఖ అధికారి నరేశ్ సభోర, కలిమెల సమితి అధికారులు పాల్గొన్నారు.

ఒడిశా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు అరెస్టు



ఉదిత్ ప్రధాన్

భువనేశ్వర్: నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్‌యూఐ) రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఉదిత్ ప్రధాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. 19 ఏళ్ల విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణ. ఈ మేరకు స్థానిక మంచేశ్వర్ పోలీస్ ఠాణాలో దాఖలైన ఫిర్యాదు ఆధారంగా నిందితుని అరెస్టు చేశారు. ఈ సంఘటన ఈ ఏడాది మార్చి 18న జరిగినట్లు పోలీసు వర్గాల సమాచారం. నిందిత ఉదిత్ ప్రధాన్ తనను విందుకు ఆహ్వానించి శీతల పానీయంలో రహస్యంగా మత్తు మందు కలిపి హోటల్ గదిలో తనపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధిత విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న నేరాల పట్ల గళం విప్పుతున్న కాంగ్రెస్ పార్టీకి ఈ అరెస్టు తీవ్ర ఇబ్బందికర పరిస్థితిని ఆవిష్కరించింది. ఈ పరిస్థితిపై నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా జాతీయ శాఖ అధ్యక్షుడు ఘాటుగా స్పందించారు. రాష్ట్ర శాఖ అరెస్టు నేపథ్యంలో అతడ్ని పదవి నుంచి సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలు అవుతాయని స్పష్టం చేశారు. మహిళల పట్ల నేరాల్ని కాంగ్రెసు నిరంతరం వ్యతిరేకిస్తుంది. బాలాసోర్ ఫకీరు మోహన్ కళాశాల విద్యార్థిని సౌమ్య శ్రీ బిసి ఆత్మాహుతి మరణం సంఘటనపై కొనసాగుతున్న ఆందోళన నిరవధికంగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుని అరెస్టు సంఘటన పూర్వాపరాల నిజనిర్ధారణ కోసం రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సస్మిత బెహరా అధ్యక్షతన ఆరుగురు సభ్యులతో ప్రత్యేక నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసింది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ ఆదేశాల మేరకు ఏర్పాటైన ఈ కమిటీ నివేదిక ఆధాంగా తదుపరి కార్యాచరణ కొనసాగుతుందని ప్రకటించారు. నిజనిర్ధారణ కమిటీలో సస్మిత బెహరా, కటక్ నియోజక వర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే సోఫియా ఫిరదౌస్, డాక్టరు దేవస్మిత శర్మ, సోనాలి సాహు, జయక్ష పాత్రొ, డాక్టరు మనీషా దాస్ పట్నాయక్ సభ్యులుగా ఉన్నారు.

ప్లాస్టిక్ సీసాల్లో పెట్రోల్ అమ్మకం నిషేధం

- మంత్రి కృష్ణ చంద్ర పాత్రో



పెట్రోల్ బంక్ యజమానుల సంఘం ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి కృష్ణ చంద్ర పాత్రో

భువనేశ్వర్: రాష్ట్రంలో ఇటీవల పెట్రోల్ మరణాలు ప్రభుత్వానికి కంటి మీద కునుకు చెదరగొట్టాయి. బాలాసోర్ ఫకీర్ మోహన్ కళాశాల ఆత్మాహుతి మరణం మరువ కముందే పూరీ బొలొంగా ప్రాంతంలో బాలికకు నిప్పు అంటించిన సంఘటనతో పెట్రోలు, డీజిలు విక్రయ వర్గాలు ఆందోళనకు గురయ్యాయి. ఇటువంటి అవాంఛనీయ సంఘటనల్లో తమపై ఎటువంటి ఆరోపణలు తలెత్తకుండా ఈ వర్గం అప్రమత్తం అయింది. ఇక నుంచి పెట్రోల్‌ను బహిరంగంగా విక్రయించేది లేదు. పెట్రోల్ పంపుల వద్ద వాహనాల్లో మాత్రమే పెట్రోల్ నింపుతారని పెట్రోలియం డీలర్ల సంఘం అధ్యక్షుడు శశాంక్ శేఖర్ సాహు ఆదివారం రాత్రి ప్రకటించారు. ఈ మేరకు చట్టపరమైన నియమాలు ఉన్నప్పటికీ పెట్రోల్ పంపుల వద్ద వాటిని పాటించలేదని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం వినియోగదారుల్లో ఆందోళన కలిగించింది. రైతులు, బోట్ మాస్టు జనరేటర్ల కోసం పెట్రోలు, డీజిలు ఇంధనం ఎలా పొందుతారని కలవరపడ్డారు. ఈ పరిస్థితుల పట్ల రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల సంక్షేమ శాఖ స్పందించింది. విభాగం మంత్రి కృష్ణ చంద్ర పాత్రో అధ్యక్షతన సోమవారం స్థానిక లోక్ సేవా భవన్‌లో పెట్రోల్ విక్రేతల సంఘం ప్రతినిధి ప్రముఖులతో సమావేశమయ్యారు. పెట్రోలు, డీజిల్ విక్రయరంగంలో వివాదరహిత సంస్కరణ కోసం సరికొత్త మార్గదర్శకాలను ఖరారు చేశారు.

మంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇక నుంచి ప్లాస్టిక్ సీసాల్లో పెట్రోల్ అమ్మడం అనుమతించబడదు. గాజు సీసాలలో పెట్రోలు తీసుకెళ్లవచ్చని వెసులుబాటు కల్పించారు. ఈ నిర్ణయం పెట్రోలియం నిబంధనలకు అనుగుణంగా ఉంది. రోడ్డు పక్కన ప్లాస్టిక్ బాటిళ్లలో పెట్రోల్ అమ్మే విక్రేతలపై తాజా సంస్కరణల ప్రకారం చర్యలు తీసుకుంటారు. అనధికారిక అమ్మకాలను నివారించేందుకు దాడులు నిర్వహిస్తారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

పర్లాకిమిడి: వనమహోత్సవాల్లో భాగంగా జాతీయ సేవా యోజన (ఎన్.ఎస్.ఎస్.) ఆధ్వర్యంలో సెంచూరియన్ వర్సిటీ అధ్యాపకులు, స్వామినాథన్ అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు 14 పంచాయతీలు 21 గ్రామాల్లో 320 మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టినట్టు సెంచూరియన్ వర్సిటీ డైరక్టర్ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ పాడీ సోమవారం తెలిపారు. ప్రధానమంత్రి ఏక్ పేడ్‌కా మాకేనామ్' పిలుపు మేరకు ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.నిహాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీన్ ప్రొఫెసర్ సత్యప్రసాద్ నందా, డీన్ (విద్యార్థుల విభాగం) డాక్టర్ బిష్ణుప్రసాద్ దాస్, తదితరులు హాజరయ్యారు. సర్దాపురం, బాపూజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, రాజీవ్ మెమొరియల్ పాఠశాల (కోర్సండ), ఠాగోర్ మెమొరియల్ ఉన్నత పాఠశాల, ఉప్పలాడ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మచ్చుమర), అల్యాన బంజిరి తదతర గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ నెల 20న సెంచూరియన్ వర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో మొక్కలు నాటిన వారిని వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య డి.ఎస్.రావు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రో పాల్గొన్నారు.



సర్దాపురంలో మొక్కలు నాటుతున్న సెంచూరియన్ వర్సిటీ ఎం.ఎస్.స్వామినాథన్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు

వినతుల వెల్లువ

పర్లాకిమిడి: గజపతి జిల్లా నువాగడ బ్లాక్ సంబల్‌పూర్ పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామముఖ పరిపాలన, స్పందన కార్యక్రమంలో జిల్లా అదనపు మాజిస్ట్రేట్ ఫల్గుణీ మఝి, జిల్లా ఎస్పీ జ్యోతింద్ర కుమార్ పండా, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి శంకర కెరకెటా, ప్రాజెక్టు అధికారి (ఐ.టి.డి.ఏ.) అంశుమాన్ మహాపాత్రో, సబ్ కలెక్టర్ అనుప్ పండా పాల్గొన్నారు. నువాగడ సమితిలో పరిమళ, సుందర్ డంగ్, అనుగురు, సంబల్‌పూర్ పంచాయతీల నుంచి మొత్తం 30 వినతులు అధికారులకు అందాయి. వాటిలో ఒకటి అక్కడికక్కడే పరిష్కరించారు. మిగాతా వినతులు వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఏడీఎం ఆదేశించారు. ఒకరికి ఆర్థిక సహాయం కింద రూ.5 వేలను సీఎం సహాయ నిధి నుంచి చెక్కును అందజేశారు. ఈ స్పందనలో నువాగడ సమితి అధ్యక్షురాలు మాలతీ ప్రధాన్, బీడీఓ లోకనాథ్ శోబోరో, జిల్లా ముఖ్యవైద్యాధికారి ఎం.ఎం.ఆలీ, జిల్లా సామాజిక భద్రతా అధికారి సంతోష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌తో ముఖ్యమంత్రి సమావేశం



ఇరువురు ప్రముఖుల భేటీ

భువనేశ్వర్: గవర్నర్ కంభంపాటి హరిబాబు, సీఎం మోహన్ చరణ్ మాఝి రాజ్‌భవన్‌లో సోమవారం సమావేశమయ్యారు. వీరి భేటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర పాలన వ్యవహారాలు, అభివృద్ధి ప్రణాళిక, ప్రజా సంక్షేమాన్ని బలోపేతం చేసే మార్గాలపై ఇరువురి మధ్య హృదయపూర్వకంగా చర్చ సాగినట్లు గవర్నర్ డాక్టరు హరి బాబు కంభంపాటి తెలిపారు. పూరీ శ్రీ జగన్నాథుని రథ యాత్రలో తొక్కిసలాట, బాలాసోర్ ఫకీర్ మోహన్ అటానమస్ కళాశాల విద్యార్థిని ఆత్మాహుతి మరణం, పూరీ బొలొంగా ప్రాంతంలో మైనరు బాలికకు నిప్పు అంటించిన సంఘటనలు ప్రభుత్వానికి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఈ పరిస్థితుల పట్ల ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవాలని రాష్ట్ర గవర్నర్‌పై ఒత్తిడి పెరుగుతుంది. తాజాగా సోమ వారం విపక్ష బిజూ జనతా దళ్ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డీసీ కార్యాలయాల ఆవరణలో నిరసన సభలు నిర్వహించి గవర్నరు జోక్యం కోసం అభ్యర్థన పత్రాలు అందజేశారు. ఈ పరిస్థితుల్లో గవర్నరు, ముఖ్యమంత్రి ఆకస్మిక సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధానంగా మంత్రి మండలి పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో వీరివురు సమావేశమై ఉంటారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ఘనంగా ఒడిశా అమలా సంఘ ప్రతిష్టాపన దినోత్సవం



వేదికపై రాష్ట్ర, జిల్లాల అమలా సంఘ నాయకులు

జయపురం: ఒడిశా అమలా సంఘం కొరాపుట్ జిల్లా శాఖ 82 వ ప్రతిష్టాపన దినోత్సవాన్ని ఆదివారు ఘనంగా జరుపుకున్నారు. కొరాపుట్ జిల్లా అమలాసంఘ అధ్యక్షుడు శశిభూషణ దాస్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. రాష్ట్ర అమలా సంఘ ప్రముఖులతో పాటు రాష్ట్రంలోని 15 జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. వారు ముందుగా జయపురం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. ఈ ర్యాలీ పట్టణంలోని పలు ప్రాంతాల మీదుగా కల్యాణ మండపం చేరుకుంది. అనంతరం జరిగిన ప్రతిష్టాపన ఉత్సవ సభలో ముఖ్యఅతిథిగా ఆహ్వాన కమిటీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ సెఠి ఒడిశా అమలా సంఘ అధ్యక్షులు హృదయ బిహారీ మహాపాత్రో, ముఖ్యవక్తగా రాష్ట్ర అమలా సంఘ కార్యదర్శి చిత్తరంజన్ తొరాసియ, ఒడిశా అమలా సంఘ సలహాదారు నారాయణ దాస్, రాష్ట్ర అధ్యక్షులు జ్ఞాన రంజన్‌దాస్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు దేవేంద్ర పాత్రో, అమలాసంఘ కొరాపుట్ జిల్లా శాఖ కార్యదర్శి సంజయ కుమార్ పండ ప్రభుత్వ తీరును ఖండించారు.

తమ డిమాండ్లు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

'బాలలను ఓ కంట కనిపెట్టాలి'



జువైనెల్ జస్టిస్ చట్టంపై మాట్లాడుతున్న న్యాయ సహాయ ప్రాధీకరణ కార్యదర్శి బిమల్ రవులో

పర్లాకిమిడి: సమాజంలో బాలలు నేర ప్రవృత్తికి దారి తీయకుండా పెద్దలు చూసుకోవాలని డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి బిమల్ రవుళో అన్నారు. గజపతి జిల్లా రాయగడ సమితి సన్నతుండి పంచాయతీలో చంపాపూర్ గ్రామంలో ఉచిత విద్యాహక్కు, జువైనెల్ జస్టిస్‌పై అవగాహన సదస్సును జిల్లా లీగల్ సర్వీసెస్ ప్రాధీకరణ కార్యదర్శి బిమల్ రవుళో అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సుకు రాయగడ పోలీసు స్టేషన్ ఐఐసీ స్వప్నా చౌదురి, సన్నతుండి సర్పంచ్ సంఘమిత్ర శోబోరో, సహకార సమితి విద్యాధికారి జుధిష్టర బెహరా, సామాజిక కార్యకర్త లింగరాజ పాణిగ్రాహి, క్లస్టర్ రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటరు లక్ష్మణరావు, తదితరులు హాజరై మాట్లాడారు. సమాజంలో చెడు వ్యసనాలు క్రైమ్‌కు దారితీస్తున్నాయని రాయగడ ఐఐసీ స్వప్నా చౌదురి అన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మానస్ రంజన్ పాఠక్ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ మానస్ రంజన్ పాఠక్ (కుడి వైపు వ్యక్తి)

భువనేశ్వర్: హైకోర్టు కొత్త న్యాయమూర్తిగా జస్టిస్ మానస్ రంజన్ పాఠక్ సోమ వారం ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హరీష్ టండన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. హైకోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్‌కుమార్ పూజారి, అడ్వకేటు జనరల్ పీతాంబర ఆచార్య, రాష్ట్ర హోంశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సత్యవ్రత్ సాహు, హైకోర్టు న్యాయమూర్తులు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.



ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన మంత్రులతో అడ్వకేటు జనరల్

బీజేడీ ఆందోళన



రాయగడ: ఆందోళనలో పాల్గొన్న నెక్కంటి, రఘునాథ్, తదితరులు

రాయగడ: రాష్ట్రంలో బీజేపీ అసమర్థత పాలనకు అద్దం పట్టేలా తరచూ మహిళలపై చోటుచేసుకుంటున్న సంఘటనలకు వ్యతిరేకంగా బీజేడీ స్పందించింది. బీజేపీ పాలనలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. తాజాగా బాలేశ్వర్‌లో ఫకీర్ మోహన్ సేనాపతి కళాశాలకు చెందిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. దీనికి నైతిక బాధ్యత వహించి రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బరంపురంలో గల దక్షిణాంచల్ రెవెన్యూ డివిజనల్ కమిషనర్ (ఆర్డీసీ) కార్యాలయం ఎదుట సోమవారం బీజేడీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. ఆ పార్టీకి చెందిన రాయగడ నాయకులు పాల్గొన్నారు. రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు, గుణుపూర్ మాజీ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో, అనసూయమాఝి తదితరులు బరంపురం ఆర్డీసీ కార్యాలయం ఘెరావ్‌లో పాల్గొన్నారు.

పర్లాకిమిడి: బాలేశ్వర్ జిల్లా ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థిని సౌమ్యశ్రీ మృత్యుఘటనపై బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బరంపురం దక్షిణ మండలం రెవెన్యూ డివిజనల్ కమిషనర్ కార్యాలయం ఎదుట బీజేడీ నాయకులు ప్రదీప్ మఝి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బరంపురం ఖల్లికోట్ కళాశాల గ్రౌండ్స్ నుంచి విద్యార్థి సంఘాలు ర్యాలీగా బయలుదేరారు. ఈ ర్యాలీలో సంజయ్ దాస్ వర్మ, గోపాల్‌పూర్ ఎమ్మెల్యే విక్రమ్ పండా, పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, బిజద గజపతి జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ నాయక్, పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝికి రాసిన వినతిని దక్షిణ మండలం ఆర్డీసీకి అందజేశారు.



పర్లాకిమిడి: ఆర్డీసీ దక్షిణ మండలం కార్యాలయం వద్ద మాట్లాడుతున్న గోపాల్‌పూర్ ఎమ్మెల్యే విక్రమ్ పండా



పర్లాకిమిడి: బరంపురం నుంచి ర్యాలీగా బయలుదేరిన బీజేడీ నాయకులు

క్లుప్తంగా

రైళ్లలో దొంగతనాలు చేసిన ముద్దాయికి 5 నెలల జైలుశిక్ష

విజయనగరం క్రైమ్: రైళ్లలో దొంగతనాలకు పాల్పడిన ముద్దాయికి విశాఖ రైల్వే కోర్టు సోమవారం ఐదు నెలల జైలుశిక్ష విధించింది.ఈ కేసుకు సంబంధించి విజయనగరం గవర్నమెంట్ రైల్వే పోలీస్ ఎస్సై బాలాజీ రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని ఎస్.కోట మండలం సీతారామపురానికి చెందిన గొల్లు దినేష్ కుమార్ రైళ్లలో ప్రయాణిస్తూ తోటి పాసింజర్లను పరిచయం చేసుకునేవాడు. వారిని మాటలలో మభ్యపెట్టి వారి వద్ద ఉన్న విలువైన వస్తువులను అపహరించేవాడు. ఇటీవలే రైలులో ఓ పాసింజర్ నుంచి ఖరీదైన సెల్ ఫోన్ చోరీ చేస్తుండగా జీఆర్పీ పట్టుకుంది. అనంతరం నిందితుడిని రైల్వే కోర్టులో హాజరుపరచగా కేసు విచారణ అనంతరం విశాఖ రైల్వే కోర్ట్ మేజిస్ట్రేట్ అనురాగ్ రైళ్లలో ముద్దాయి గొల్లు దినేష్ కుమార్‌కు 5 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు చెప్పారు.

విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధిలోని సారధి గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మ నాయుడు ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయందోళనకు గురయ్యారు. వెంటనే రాజాం ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా ఎస్సై అశోక్‌తోపాటు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయని, ప్రమాదంలో రూ.70 వేల ఆస్తినష్టం జరిగిందని తెలిపారు.

5,600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న బెల్లం ఊట డ్రమ్ములను చూపిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ బి.శ్రీనాథుడు ఆదేశాల మేరకు అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.సంతోష్ ఆధ్వర్యంలో సోమవారం ఒడిశాలోని రాయగడ ఎక్సైజ్ సిబ్బందితో కలిసి ఆంధ్ర-ఒడిశా సరిహద్దు గ్రామాలైన సందుబడి పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 30 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన సుమారు 5,600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశామని, అలాగే 780 లీటర్ల సారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ దాడుల్లో పార్వతీపురం, విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి, కురుపాం ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారని తెలియజేశారు.

ముగ్గురు గంజాయి నిందితుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: నగరంలోని రైల్వే స్టేషన్ వద్ద ఎంఎస్ఆర్ లాడ్జిలో పోలీసులు సోమవారం సోదాలు చేసి ఒడిశాకు చెందిన ముగ్గురు గంజాయి నిందితులను అరెస్ట్ చేశారు. లాడ్జిలో తనిఖీ చేసిన సందర్భంగా రెండు సూట్‌కేసుల్లో 30 కేజీల గంజాయితో నిందితులు దొరికారు. ఈ మేరకు సీఐ బంగారు పాప గంజాయితో పాటు ముగ్గురు నిందితులను వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. వన్‌టౌన్ సీఐ చౌదరి మాట్లాడుతూ నిందితులను విచారణ చేస్తున్నామన్నారు.

కరెంట్ కష్టాలు..

భోగాపురం: మండలంలోని తోటవీధి సహా మరికొన్ని వీధుల ప్రజలను కరెంట్ కష్టాలు వీడడం లేదు. తరచూ తమ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. ఇదిలా ఉంటే ఆదివారం రాత్రి 9 గంటల నుంచి సోమవారం సాయంత్రం 6 గంటలకు వరకు కొన్ని గ్రామాలకు కరెంట్ సరఫరా కాకపోవడంతో ఉక్కపోత, దోమలతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. ప్రతిసారి ఇలాగే జరుగుతున్నా విద్యుత్‌పునరుద్ధరణ చర్యలు మాత్రం చేపట్టడం లేదని, ఇంత నిర్లక్ష్యమా అని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కరెంట్ అవస్థలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

జీతాలు చెల్లించడంలో తాత్సారం తగదు..

గజపతినగరం: ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీ నెపంతో ప్రభుత్వం జీతాలు నిలిపి వేయడం సరికాదని ఎస్టీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.చంద్రరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు జూన్, జూలై జీతాలు కూడా అందలేదన్నారు. సమస్య పరిష్కారం కానిఎడల ఉద్యమం చేపట్టక తప్పదన్నారు.

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

• కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



ఫిర్యాదు దారులనుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఏపీఓ చిన్నబాబు

పార్వతీపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులకు తేల్చిచెప్పారు. అర్జీలపై సత్వరమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్ఓ కె.హేమలత, ఎస్‌డీసీ ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణిలు 148 వినతులను వివిధ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారుతో మాట్లాడుతూ అర్జీలను పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీదారు సంతృప్తి చెందేలా వేగంగా పరిష్కరించినపుడే అధికారులపై విశ్వాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరమే పరిష్కారం

ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తన వద్దకు వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత స్టేషన్ అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. వచ్చిన ఫిర్యాదుల్లో ప్రధానంగా కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించు కోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో ఎస్పీ మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాస్తవాలైతే చట్టపరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 10 ఫిర్యాదులు అందగా ఎస్బీ సీఐ రంగనాథం, డీసీఆర్బీ సీఐ ఆదాం, ఎస్సై ఫక్రుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 95 అర్జీలు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల వేదికకు 95 వినతులు వచ్చాయి. మండలంలోని పులిపుట్టి పంచాయితీ కొత్తగూడకు చెందిన సవర ప్రశాంత్‌కుమార్ అటవీపట్టా ఇప్పించాలని అర్జీ ఇచ్చారు. తమకు కుట్టుమిషన్‌లు మంజూరు చేయాలని అనిత,అశ్విని, సంధ్యారాణిలు విన్నవించారు. పులిగుమ్మికి చెందిన కూర్మారావు డైరీఫారం మంజూరు చేయాలని కోరగా సిరికొండ ఒబ్బంగికి చెందిన ఊర్లక శారద ఆశవర్కర్ పోస్టు కావాలని కోరింది. ఆశ్రమపాఠశాలలో అవుట్‌సోర్సింగ్ పోస్టు ఇప్పించాలని దీనబంధు, భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని వాబ గ్రామానికి చెందిన శంకరరావు వినతి ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్, ఏపీడీ సన్యాసిరావు, జీసీసీ మేనేజర్లు డి.కృష్ణ, జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల విద్యపై నిర్లక్ష్యం తగదు

• రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ శంకరరావు



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ శంకరరావు

విజయనగరం అర్బన్: గిరిజనులకు మెరుగైన విద్య నందించేందుకు అందరూ కృషిచేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావు సోమవారం అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో కొన్ని గిరిజన పాఠశాలలకు ఉపాధ్యాయులు గైర్హాజరు కావడం పట్ల రాష్ట్ర ఎస్టీ కమిషన ఛైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల తీరుపై పత్రికలలో వచ్చిన కథనాలపై ఆయన స్పందించారు. వివిధ కారణాల వల్ల ఇప్పటికే ఆదివాసీలు విద్యకు దూరమవుతున్నారని, పక్కా భవనాలు, ఉపాధ్యాయులు ఉన్న చోట, ఉపాధ్యాయుల నిర్లక్ష్య వైఖరి వల్ల చిన్నారులు విద్యకు దూరం కావడం శోచనీయమన్నారు. మన్యం జిల్లాలో ఇటువంటి పాఠశాలలు ఇంకా ఎన్ని ఉన్నాయి? ఎందుకు సంబంధిత అధికారులు పాఠశాలలను పర్యవేక్షణ చేయడం లేదనే అంశాలపై జిల్లా యంత్రాంగం నివేదిక సమర్పించాలని ఆదేశించారు. భవిష్యత్‌లో ఇటువంటి పరిణామాలు పునరావృతం కాకుండా చూడాలని, గిరిజనుల చదువుకునేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.

మందు పిచికారీచేసిన గడ్డినితిని ఏడు మేకల మృతి



మృతిచెందిన మేకలు

మక్కువ: మండలంలోని డి.శిర్లాం, గోపాలపురం గ్రామాల సమీపంలోని ఓ పామాయిల్‌తోటలో గడ్డి నివారణ కోసం మందును రైతు పిచికారీచేయడంతో, పంటపొలంలోని ఆ గడ్డిని తిని ఏడు మేకలు సోమవారం మృతిచెందాయి. గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు మేతకోసం సుమారు 200గొర్రెలు, మేకలను పంటపొలాల వైపు తరలించారు. పామాయిల్ తోటలో గడ్డిని మేకలు మేస్తుండగా, ఒక్కసారిగా అస్వస్థతకు గురి కాగా వాటిలో ఏడు మేకలు అక్కడికక్కడే మృతిచెందాయి. విషయం తెలుసుకున్న పశువైద్యసిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అస్వస్థతకు గురైన మేకలకు వైద్యచికిత్స అందించారు. మృతిచెందిన ఏడు మేకల విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని గొర్రెల కాపరులు లబోదిబోమన్నారు.

రిటైర్డ్ ఎస్సైపై యువకుల దాడి



రిటైర్డ్ ఎస్సైపై దాడికి పాల్పడిన ఇద్దరు నిందితులు

విజయనగరం క్రైమ్: నగరంలోని అయ్యప్పనగర్‌కు చెందిన రిటైర్డ్ ఎస్సై ముని బుచ్చిరాజుపై దాడి చేసిన ముగ్గురు నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రిటైర్డ్ ఎస్సై మునిబుచ్చిరాజు తన కొడుకును ఈ నెల 19 వ తేదీ రాత్రి రైల్వేస్టేషన్‌లో దింపి తిరిగి ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యంలో బైక్ ట్రబుల్ ఇవ్వడంతో పాతబస్టాండ్‌లో బైక్ ఉంచేసి నడుచుకుంటూ ఇంటికి బయల్దేరారు. ఆ సమయంలో బొండపల్లి మండలం గుమడాం గ్రామస్తులు పవన్, రాజేష్, అలాగే హుకుంపేటకు చెందిన సాయి(18) రిటైర్డ్ ఎస్సై రాజుపై దాడి చేసి జేబులో ఉన్న రూ.3 వేల నగదు దోచుకుని పరారయ్యారు. అతి కష్టం మీద రిటైర్డ్ ఎస్సై రాజు ఇంటికి చేరుకుని స్థానికుల సహాయంతో హాస్పిటల్‌కు వెళ్లి చికిత్స చేయించుకుని 20 వ తేదీన టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్సై కృష్ణమూర్తి కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను సోమవారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు.

చికిత్స పొందుతూ హెచ్‌సీ మృతి



చికిత్స పొందుతూ మరణించిన ఏపీఎస్‌పీ హెచ్‌సీ కోరాడ రాము నాయుడు (ఫైల్)

డెంకాడ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ చింతలవలస ఐదవ ఏపీఎస్పీ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్, ఏపీ పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోరాడ రామునాయుడు (49) సోమవారం మరణించారు. గత నెల 23న చింతలవలస ఐదవ ఏపీఎస్పీ బెటాలియన్ మెయిన్ గేట్ సమీపంలో విజయనగరం-విశాఖ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో హెచ్‌సీ రామునాయుడు తీవ్ర గాయపడ్డారు. గాయపడిన ఆయనను విశాఖలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మరణించారు. రామునాయుడు మృతదేహాన్ని విజయనగరంలోని కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తీసుకువచ్చారు. పోస్టుమార్టం అనంతరం రామునాయుడు పార్థివ దేహాన్ని స్వగ్రామమైన విశాఖపట్నం జిల్లాలోని పద్మనాభం మండలంలోని కోరాడ గ్రామానికి తరలించారు. రామునాయుడు మరణించడంతో గ్రామమంతా విషాదంలో మునిగిపోయింది. మృతుడు హెచ్‌సీకి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతుడి భార్య సూర్యకాంతం డెంకాడ మండలంలోని మోపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్స్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పెద్దకుమార్తె మౌనిషసాయి ఎంబీబీఎస్ చదువుతుండగా చిన్నపాప దాషిని ఇంటర్ పూర్తి చేసింది. కోరాడ రామునాయుడు మరణవార్త బెటాలియన్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది.

ప్రగాఢ సంతాపం

మరణించిన హెచ్‌సీ కోరాడ రామునాయుడు కుటుంబానికి పలువురు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. విజయనగరం కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో హెచ్‌సీ కోరాడ రామునాయుడు మృతదేహాన్ని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సందర్శించి నివాళి అర్పించారు. బెటాలియన్ అదనపు కమాండెంట్ సి.రాజారెడ్డి, పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది, బెటాలియన్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఎం.అప్పలనాయుడు, డెంకాడ, పద్మనాభం మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

27న అండర్-17 చెస్ క్రీడాకారుల ఎంపిక

• చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం కార్యదర్శి జ్వాలాముఖి

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న చెస్ పోటీల్లో పాల్గొనబోయే అండర్-17 జిల్లా బాల, బాలిక ల క్రీడాకారుల ఎంపిక ఈనెల 27న నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ ఆఫ్ వియనగరం జిల్లా కార్యదర్శి కేవీ.జ్వాలాముఖి సోమవారం తెలిపారు. ఈ మేరకు విజయనగరంలోని రింగ్‌రోడ్డులో గల ఫైర్ చెస్ స్కూల్‌లో నిర్వహించే ఎంపిక పోటీల్లో 2008 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు విధిగా జనన ధ్రువీకరణపత్రం వెంట తీసుకురావాలని సూచించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో కాకినాడలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం నుంచి సొంత ఖర్చులతో తీసుకువెళ్లనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకోసం పోన్ 9703344488 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బాలికను కుటుంబం చెంతకు చేర్చిన పోలీసులు

పెందుర్తి: తల్లిదండ్రులపై అలిగి ఇంట్లో నుంచి బయటకు వచ్చి అనాథలా తిరుగుతున్న ఓ బాలికకు పెందుర్తి పోలీసులు రక్షణ కల్పించారు. వారం రోజుల తరువాత ఆ బాలికను సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలివి.. విజయనగరం జిల్లా శృంగవరపుకోట(ఎస్.కోట) సమీపంలోని కాశీపట్నానికి చెందిన ఓ బాలిక(12) ఈ నెల 13న వేపగుంట ప్రాంతానికి వచ్చి, అనాథగా తిరుగాడుతోంది. స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ కె.వి. సతీష్‌కుమార్ ఆదేశాలతో బాలికను నగరంలోని చైల్డ్ వెల్ఫేర్ హోమ్‌కు తరలించారు. బాలికను విచారించగా తన వివరాలు చెప్పింది. ఈ క్రమంలో పోలీసులు బాలిక కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సోమవారం బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ వెల్లడించారు.

తల్లిదండ్రులు మందలించారని..

పెందుర్తి: తల్లిదండ్రులు మందలించారని ఇంట్లో నుంచి బయటకు వచ్చేసిన ఓ మైనర్ బాలిక(16)ను పెందుర్తి పోలీసులు తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం దేశపాత్రునిపాలెంలో నివాసం ఉంటున్న ఓ మైనర్ బాలిక తన తల్లిదండ్రులు మందలించారన్న కారణంతో ఈ నెల 17న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. దీనిపై కొత్తవలసతో పాటు, పెందుర్తి పోలీస్ స్టేషన్లలో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సీఐ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ దేముడుబాబు ఆధ్వర్యంలోని పెందుర్తి పోలీసుల బృందం నగరంలో గాలించగా నగరంలోని రైల్వే స్టేషన్‌లో సదరు బాలిక ఆచూకీ లభించింది. సోమవారం ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు.

సారా పట్టివేత

గుర్ల: మండలంలోని దేవునికణపాకలో 40 లీటర్ల సారా తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై పి.నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పరిసరాల్లో సోమవారం తనిఖీలు చేపడుతుండగా.. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సారా తరలిస్తూ పట్టుబడ్డారన్నారు.

అర్జీదారులు సంతృప్తిచెందేలా పరిష్కారం

• కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేద్కర్



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ అంబేద్కర్, జేసీ సేతు మాధవన్



ఫిర్యాదు దారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్‌జింద్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం అర్బన్: ప్రజావినతుల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల వినతులను వారు సంతృప్తిచెందే విధంగా సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డిప్యూటీ కలెక్టర్‌లు మురళి, ప్రమీలా గాంధీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు అందజేసిన అర్జీలపై సంబంధిత అధికారులకు వెంటనే కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారుల సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని అర్జీదారు సంతృప్తిచెందేలా సమస్యలను వేగంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. సోమవారం పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి వచ్చిన వినతుల్లో పీజీఆర్ఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ స్వీకరించినవి 178 ఉన్నాయి. వాటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి భూ సమస్యల అర్జీలు 86 వరకు ఉన్నాయి. పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డీఆర్డీఏకు 27, మున్సిపాలిటీకి 11, విద్యాశాఖకు 10, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖలకు చెరో 6, వైద్యశాఖకు రెండు వినతులు వచ్చాయి. అదే విధంగా సచివాలయ సిబ్బంది ఆఫ్‌లైన్‌లో స్వీకరించిన ఫిర్యాదుల్లో 'తల్లికి వందనం' పథకానికి అర్హులమైనా మంజూరు కావడం లేదన్న అందిన వినతులు మరో 120 వరకు ఉన్నాయి.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కు 39 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందల్ బాధితుల నుంచి 39 ఫిర్యాదులు స్వీరించారు. కార్యక్రమంలో వారి సమస్యలను శ్రద్ధగా విని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత సిబ్బందికి వివరించారు. మొత్తం 39 ఫిర్యాదులు రాగా అందులో భూతగాదాలకు సంబంధించి 11, కుటుంబ కలహాలకు సంబంధించి 5, మోసాలకు పాల్పడినట్లు 5, ఇతర అంశాలకు సంబంధించి 18 ఫిర్యాదులు ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సీఐ ఏవీ లీలారావు, డీసీఆర్బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.

పలు సమస్యలపై జేసీకి ఎస్ఎఫ్ఐ వినతి



జేసీ సేతుమాధవన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం గంటస్తంభం: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) విజయనగరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమంలో పలు సమస్యలపై జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సీహెచ్ వెంకటేష్ లు మాట్లాడుతూ జిల్లాలో బీసీ సంక్షేమ హాస్టల్స్‌లో పరిస్థితి అగమ్య గోచరంగా ఉందన్నారు. ప్రధానంగా పూసపాటి రేగ మండలంలో బీసీ కాలేజ్ హాస్టల్‌లో ఇప్పటికీ తాగునీరు సదుపాయం లేదని, అక్కడ ఉన్న విద్యార్థులు తాగడానికి మురుగునీరే శరణ్యమైందని విమర్శించారు. గతంలో ఎస్ఎఫ్ఐ ఆమరణ నిరాహారదీక్షలు చేసినప్పుడు సాక్షాత్తు కలెక్టర్ ఆ హాస్టల్ కు ఆర్వో ప్లాంట్ హామీ ఇచ్చారని నేటికి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు ఆ హామీ నెరవేర్చలేదని విమర్శించారు. తక్షణమే పూసపాటి రేగ మండల కేంద్రంలో ఉన్న బీసీ కాలేజ్ హాస్టల్‌కు ఆర్వో వాటర్ ప్లాంట్ సదుపాయం కల్పించాలని కోరారు. భోగాపురం మండలంలో శిథిలావస్థలో బీసీ చిన్నపిల్లల హాస్టల్ ఉందని అది శిథిలావస్థకు చేరుకుని మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు పక్కా భవనం నిర్మాణం చేయలేదన్నారు. దాని కారణంగా 100కు పైగా ఉండే విద్యార్థులు ఇప్పుడు 20కు పడిపోయారన్నారు. తక్షణమే జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఆ హాస్టల్ నిర్మాణానికి నిధులు విడుదల చేసి నిర్మాణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఒకే ఒక్క బీసీ అమ్మాయిల కాలేజ్ హాస్టల్ ఉందని ఆ హాస్టల్ నందు దాదాపు 260 మంది విద్యార్థులు వసతి పొందడం ప్రభుత్వం దౌర్భాగ్య పరిస్థితిని చూపెడుతోందని విమర్శించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరో బీసీ అమ్మాయిల కాలేజ్ హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఒ.రవికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.రమేష్, కె.రాజు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించేందుకే కళాజాతా



ఐటీడీఏ ప్రాంగణంలో కళాజాతా ప్రదర్శనను పరిశీలిస్తున్న పీఓ, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం: గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధుల గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు కళాజాతాను ఏర్పాటు చేస్తున్నట్లు ఐటీడీఏ పీఓ, పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ప్రాంగణంలో కళాజాతా ప్రదర్శన తీరును ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జ్వరాలపై జాగ్రత్తలు, అందుబాటులో ఉన్న వైద్యసేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళాజాతాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. గిరిజన గ్రామాల్లో షెడ్యూల్ వారీగా ప్రదర్శన చేయాలని కోరారు. కళాజాతాపై గ్రామాల్లో ముందు రోజు తెలియజేయాలని సూచించారు. వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ పి.మురళీధర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.కేవీఎస్.పద్మావతి, డీఐఓ డా.జగన్‌మోహన్‌రావు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూడాలి



బూర్జగ్రామంలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎన్‌సీడీ పీఓ డా.జగన్‌మోహన్‌రావు

సీతానగరం: గ్రామాల్లో ఆరోగ్య సర్వేలు పక్కాగా చేపట్టి ప్రజలు రోగాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు పేర్కొన్నారు. ఈ మేరకు బూర్జ గ్రామంలో నిర్వహించిన సంచార చికిత్స వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య తనిఖీలు, అందజేస్తున్న చికిత్స వివరాలు ఈ సందర్భంగా రికార్డుల్లో పరిశీలించారు. అనారోగ్య సమస్యలను స్పష్టంగా నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రమ్య, సీహెచ్ఓ గాయత్రి, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల వితరణ



క్రీడా దుస్తులతో విద్యార్థులు

రేగిడి: లింగాలవలస ఉన్నత పాఠశాలలో క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు సంతకవిటి మండలం సిరిపురం గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి బి.సన్యాసిరావు రూ.4,500 విలువైన క్రీడా దుస్తులు సమకూర్చారు. వీటిని విద్యార్థు లకు సోమవారం పంపిణీ చేశారు. దాతకు వ్యాయామ ఉపాధ్యాయుడు సన్నిబాబు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్ఎం కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోండి

• కలెక్టరేట్‌లో డీఆర్వో శ్రీనివాసమూర్తికి ఏఐఎస్ఎఫ్ వినతి



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విజయనగరం గంటస్తంభం: జిల్లాలో నిబంధనలు పాటించని కళాశాలలు ఉన్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన తమ సంఘ నాయకులతో కలెక్టరేట్‌కు సోమవారం వెళ్లి, డీఆర్వో శ్రీనివాసమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్ని ప్రైవేటు కళాశాలలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూనే నీట్, ఐఐటీ అని కోచింగ్‌ల పేరిట పెద్దమొత్తంలో డబ్బులు తీసుకుంటూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని తెలిపారు. సెలవు రోజుల్లోనూ తరగతులు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్నారు. చర్యలు తీసుకుంటామని డీఆర్వో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మహిళా ప్రతినిధులు భాను, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.